క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులపై దృష్టి

సైదాపురం/వెంకటగిరి రూరల్: రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏడీ హైమావతి, నిమ్మ, చీనీ పరిశోధన స్థానం డాక్టర్ ఎం రమణయ్య రైతులకు సూచించారు. సైదాపురం మండలంలోని మర్లపూడి, కొమ్మిపాడు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానంగా రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలన్నారు. నిమ్మ, చీనీ పండ్ల తోటల సాగులో శాస్త్రవేత్తలు నిర్దేశించిన ఎరువులు 75శాతం మోతాదులో వినియోగించాలని డాక్టర్ రమణయ్య సూచించారు.

నేడు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


ప్రతిష్టించనున్న అమ్మవారి విగ్రహాలు

సైదాపురం: మండలంలోని తోకలపూడి గ్రామంలో గ్రామ శక్తి స్వరూపులైన యామాలమ్మ, గంగమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ప్రత్యేక వేదపండితులు ఆధ్వర్యంలో బుధవారం విశేషాభిషేకాలు, పూజలు, గణపతి, రుద్ర, చండీ, సుదర్శన, మూలమంత్ర హోమాలతో నిర్వహించనున్నట్లు ఆలయ పెద్దలు తెలిపారు. నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు.

16న కృష్ణాష్టమి వేడుకలు


పెంచలకోన క్షేత్రం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 16న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారికి ఉదయం 9 గంటలకు నవ కలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం ఉట్టి మహోత్సవం, రాత్రి శేషవాహనంపై స్వామి అమ్మవార్ల క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

యువకుడి ఆత్మహత్య


కిషోర్(ఫైల్)

రాపూరు: మండలకేంద్రం రాపూరు సిద్దలయ్య సెంటర్‌కు చెందిన ఓ యువకుడు మంగళవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా.. వెంకటేశ్వర్లు, రత్నమ్మ రెండవ కుమారుడు కిషోర్(25) రేకుల ఇంట్లో ఎవరూ లేని సమయంలో కమ్మీలకు చీర చుట్టి ఉరేసుకున్నాడని చుట్టుపక్కల వారు చూసి వెంటనే వైద్యశాలకు తరలించే సమయానికి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మహిళ మృతదేహం లభ్యం



వెంకటగిరి రూరల్ : గుర్తు తెలియని మహిళ మృతదేహం తెలుగుగంగ కాలువలో కొట్టుకువచ్చింది. ఎస్‌ఐ మస్తాన్ కథనం మేరకు.. జంగాలపల్లి గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 50- 55 ఏళ్ల వయసు మహిళ మృతదేహం ముళ్లపొదలకు తగులుకుని ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించగా మృతదేహాన్ని కాలువలో నుంచి వెలుపలకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చిరొట్ట పంపిణీ చేయండి

ఓజిలి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు విరివిగా పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసరను సరఫరా చేయాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ మంగళవారం నిర్వహించారు. ముందుగా విద్య, వైద్యం, వ్యవసాయ, ట్రాన్స్‌కో, అంగన్‌వాడీ, రెవెన్యూ, సాగు, రెవెన్యూ, తాగునీటి శాఖల అధికారులతో చర్చించారు. మాట్లాడుతూ మండలంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇతర గ్రామాలకు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను ముమ్మరం చేసి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సీడీపీఓ ఉమమహేశ్వరి, ఈఓపీఆర్డీ రేణుక పాల్గొన్నారు.

చికెన్ ధరలు 13.8.2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	118
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	216
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	240
లేయర్ చికెన్	:	200

ఆర్టీసీలో సమస్యలు పరిష్కరించాలి




సూళ్లూరుపేట: నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు, వెంకటగిరి: ఎన్‌ఎంయూ నేతల ఆందోళన, గూడూరు: ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

సూళ్లూరుపేట/వెంకటగిరి రూరల్/గూడూరు రూరల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర నేషనల్ మజ్దూర్ యూనియన్ వారు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు ఆర్టీసీ డిపోల ఉద్యోగులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ బుధవారం కూడా నిరసన తెలపనున్నట్లు వివరించారు. వారి ఆందోళనకు కారణమైన సమస్యలను వివరించారు. అవేంటంటే..

గవర్నర్‌పేట -2 డిపోను లులూ అనే ప్రయివేట్‌కు కంపెనీకి ఇచ్చిన 4.5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇవ్వడం వెనక్కి తీసుకోవాలి. విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేసి నడపాలి. పది నెలలుగా ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో వాటిని వెంటనే పరిష్కరించాలి. పెండింగ్‌లో వున్న ప్రమోషన్లను వెంటనే ఇప్పించాలి. గ్యారేజి సిబ్బందికి 12 ఏళ్ల ఇంక్రిమెంట్ కలపాలి. ఆగస్టు 15 నుంచి అమలులోకి రానున్న మహిళలకు ఉచిత బస్సు విషయంలో సిబ్బందికి కలిగే ఇబ్బందులను తొలగించాలి. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డీఏ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్‌సీలను వెంటనే చెల్లించాలి.

సూళ్లూరుపేటలో ఏపీఎన్‌జీఓ అధ్యక్షులు ఎస్ జనార్దన్, అసోసియేషన్ నాయకులు ఏ సుబ్రమణ్యం, డిపో సెక్రటరీ ఎం శేఖర్, అధ్యక్షులు కే కరుణాకర్‌రెడ్డితో పాటు ఆర్టీసి ఉద్యోగులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో ఏపీఎన్‌జీఓ వెంకటగిరి తాలుకా సెక్రటరీ డి ఫణికుమార్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌డీఏ రజాక్, వైస్ ప్రెసిడెంట్ కెఆర్ బాబు, జాయింట్ సెక్రటరీ జి సుబ్బారావు, ట్రెజరర్ ఏఎం గురవయ్య, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్‌కే జి బాషా తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో ఏపీ ఎన్‌జీఓ అధ్యక్షుడు శ్రావణ్, సెక్రటరీ తనూజ్, ఎన్.ఎం.యూ.ఏ రీజనల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య, రీజనల్ అసిస్టెంట్ సెక్రటరీ శ్రావణ్, డిపో చైర్మన్ బాషా, అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, పోలయ్య, రమేష్, రఘు, సుధాకర్, శేఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

కోట/చిట్టమూరు: వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరని కోట తహసీల్దార్ జయ జయరావు స్పష్టం చేశారు. ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాల నిర్వహణపై సూచనలిచ్చారు. కోట మండలంలో శ్రీనివాస సత్రం బీచ్‌లో విగ్రహాల నిమజ్జనానికి అనుమతి ఇస్తున్నామన్నారు. మండపాలకు, ఉత్సవాలకు ఉత్సవ కమిటీలు అనుమతి తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో వినాయకచవితిని జరుపుకోవాలని సూచించారు. చిట్టమూరు సీఐ హుస్సేన్ బాషా మాట్లాడుతూ డీజేలకు ఎటువంటి అనుమతులు ఉండవన్నారు. బాణసంచా కూడా పేల్చకూడదని పేర్కొన్నారు. నిమజ్జనానికి సంబంధించి తూపిలిపాళెం బీచ్‌లో క్రేన్ ఉపయోగిస్తున్నామని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపేతే కేసులు నమోదు చేస్తామన్నారు. నిమజ్జన సమయంలో చిన్నపిల్లలను బీచ్‌ల వద్దకు తీసుకురాకూడదని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

చిల్లకూరు: రాష్ట్రంలో పాలన చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ మేధావుల పోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌పీఎస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగకుండా దాడులకు పాల్పడి భయాందోళనలు సృష్టించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. దీనిని ప్రజలు హర్షించరని భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

షోడశ మహాలక్ష్మీపూజ


షోడశ పూజలందుకున్న మహాలక్ష్మి

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీ మత్కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం మంగళవారం సందర్భంగా సకల రోగాల నివారణ కోసం షోడశ మహాలక్ష్మీ పూజలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కాకి శ్రీరామ్మూర్తి, పైడిమర్రి కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సకల సౌభాగ్యాల నొసగు షోడశ మహాలక్ష్మీ పూజను శ్రీలక్ష్మీ కుమారి (అచ్చు) పర్యవేక్షణలో అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. 108 మంది మహిళలకు పసుపు కుంకుమతో కూడిన సారెను అందజేశారు.

స్మార్ట్ మీటర్లతో అదనపు భారం

నాయుడుపేటటౌన్ : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజలపై అదనపు భారం వేయవద్దని సీఐటీయూ నాయకులు ముకుందా డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ పట్టణంలోని విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద ఆ సంఘం నాయకులతో కలిసి మంగళవారం సాయంత్రం ఆందోళనలు చేపట్టారు. ఆ శాఖ అధికారులను కలిసి వినతి పత్రాన్ని అందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్ట్


పట్టుబడిన నిందితులతో పోలీసులు

చిట్టమూరు: ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు వాకాడు సీఐ హుస్సేన్ బాషా తెలిపారు. కలగుర్తిపాడు అటవీ ప్రాంతం నుంచి కొందరు వాహనంలో రాగి, అల్యూమినియం తీగలు తీసుకెళ్తుండగా మంగళవారం ఎస్‌ఐ చిన్నబలరామయ్య తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఐదుగురు ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడుతున్నట్లు తేలింది. పట్టుబడిన వారిలో ఆరూరుమిట్ట దళితవాడకు చెందిన గంగిపంగి వెంకటేష్, ఎర్రబల్లి పోలయ్య, కంటేపల్లి కోటీశ్వరరావు, కంటేపల్లి సుబ్బయ్య, కంటేపల్లి గిరిబాబు ఉన్నారు. మొత్తం 38 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ కాగా వీరిపై 4 మండలాల్లో 8 కేసులు నమోదయ్యాయని తెలిపారు. వారి వద్ద నుంచి రాగి వైరు 175 కేజీలు, అల్యూమినియం వైరు 338 కేజీలు, ట్రక్కును స్వాధీనం చేసుకుని వారిని కోట కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

యూరియా తగిన మోతాదులో వాడాలి


పంగిలిలో వరిపైరును పరిశీలిస్తున్న ఏడీ శివనాయక్

రాపూరు: వరి పైరులో అధిక మోతాదులో యూరియా వాడడం వలన పలు రకాల తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని పొదలకూరు వ్యవసాయ ఏడీ శివ నాయక్ అన్నారు. మండలంలోని పంగిలి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూరియా బదులు వ్యవసాయ శాఖ తరఫున 30 రకాలు కలిపిన అనేక రకాల ధాన్యపు గింజలను అందిస్తున్నామన్నారు. వీటి వాడకం వలన భూమి సారం పెరగడంతో పాటు పంటకు మేలు చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్క రైతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సోమసుందర్, రైతులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ముందడుగు


మాట్లాడుతున్న మత పెద్దలు

నాయుడుపేటటౌన్: సౌత్ ఆంధ్ర లూథరన్ సంఘ ఐక్యత కోసం ఆ సంఘ పెద్దలు కలిసికట్టుగా ముందడుగు వేశారు. గత 25 ఏళ్ల నుంచి రెండు వర్గాలుగా ఉన్న వారు ఒక్కటై ఐక్యతకు నాంది పలికారు. పట్టణంలోని బేరిపేటలో ఎస్‌ఏఎల్‌సీ చర్చి ఆవరణలో ఉన్న కమ్యూనిటీ హాల్లో మంగళవారం తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన బిషప్‌లు, పాస్టర్లు, సంఘ పెద్దలు, తదితరులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎస్‌ఏఎల్‌సీ బిషప్‌లు, రెండు వర్గాలకు చెందిన సంఘ పెద్దలు కే జయరావు, నాలుగు జిల్లాలకు చెందిన బిషప్‌లు, సంఘపెద్దల పాల్గొన్నారు.

ప్రకటించిన భూమి ఇవ్వాలని ధర్నా

వెంకటగిరి రూరల్: గత ఏడాది పోలేరమ్మ తల్లి జాతరలో పట్టణంలోని కాంపాళెంకు చెందిన దళితుడు చెంచుకుమార్‌పై జరిగిన లాఠీచార్జికి నష్టపరిహారంగా ప్రకటించిన రెండు ఎకరాల భూమిని పంపిణీ చేయాలని సీపీఎం నేత వడ్డిపల్లి చెంగయ్య, ఎమ్మార్పీఎస్ నేత పల్లిపాటి రవి పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత, గిరిజన, వామపక్షల ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బాలాయపల్లి (సైదాపురం): బాలాయపల్లి మండలంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురైన భైరవరం గ్రామానికి చెందిన కాకాణి వెంకటయ్య(62) నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈ మేరకు ఎస్‌ఐ గోపి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం అప్పగింత

పెళ్లకూరు: మండల కేంద్రంలోని దళితకాలనీకి చెందిన మెరియం సుధాకర్(45) మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మంగళవారం బంధువులకు అప్పగించారు. సుధాకర్ సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కండలేరులో 25.5 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 5680 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1750, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటిబ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ అదాలత్

కలువాయి(సైదాపురం) : మండల ప్రజల విద్యుత్ సమస్యలపై పొదలకూరు విద్యుత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు, విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏఈ జయకుమార్ తెలిపారు.

హిటాచీ డ్రైవర్ మృతి




రాపూరు: మండలంలోని పులిగిలపాడు సమీపంలో ఉన్న ఎస్ఎల్‌వీ క్రషర్ స్టోన్ క్రషర్ వద్ద హిటాచీ డ్రైవర్ గుర్రం శ్రీనివాసులు (35) హిటాచీలోనే పని చేస్తూ మంగళవారం మృతి చెందాడు. మంగళవారం ఉదయం హిటాచీ ఆపరేట్ చేస్తుండగా డ్రైవింగ్ సీటులోనే గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు క్రషర్ సిబ్బంది కుటుంబ సభ్యులకు, బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బాలికపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

చిల్లకూరు: బాపట్ల జిల్లా కారంచేడు గ్రామంలో బీసీ(రజక) బాలికపై దాడి చేసిన వారిపై చర్యలేవి అని నవ్యాంధ్రప్రదేశ్ రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనుపూరు జగదీష్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కారంచేడు గ్రామంలో అగ్రవర్ణాల వారు ఓ బధిర(మూగ) బాలికపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయ పరిచారన్నారు. అయితే బాలికకు అండగా నిలిచిన రజకులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణమన్నారు. వెంటనే పోలీసులు బాలికపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

స్తంభించిన తపాలా సేవలు

కోట: సర్వర్ మొరాయించడంతో తపాలా సేవలు నత్తనడకన సాగుతున్నాయి. మండలంలోని కోట, విద్యానగర్‌లో బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. ఇక్కడ ప్రజలకు మెరుగైన సేవలు అందించే క్రమంలో తపాలాశాఖ కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తేవడంతో, సంబంధిత సర్వర్లు మొరాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోజులో రెండు, మూడు గంటలు కూడా సర్వర్లు పనిచేయడం లేదు. దీంతో చిన్న పని కోసం నాలుగైదు సార్లు పోస్టాఫీసు చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఉద్యోగులు సైతం పనిచేయలేక ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై కోట బ్రాంచి పోస్ట్‌మాస్టర్ శివతేజను వివరణ కోరగా ఇదే సమస్య అన్నీ చోట్ల ఉందని చెప్పారు. కొత్త సాఫ్ట్‌వేర్ కావడంతో సర్వర్ మొరాయిస్తోందన్నారు. అయితే ఇపుడు పరిస్థితి కాస్త మెరుగుపడిందని వివరించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు


మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరురూరల్ : గంజాయి విక్రయించినా, సేవించినా, అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ పి.గీతాకుమారి హెచ్చరించారు. స్థానిక సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో దుకాణదారుడిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ఆ షాపులో గంజాయి ప్యాకెట్లను ఉంచిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు జరిపే కమిటీ వారు పోలీసు శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, బాణాసంచా కూడా ఇష్టారీతిన పేల్చితే చర్యలు తప్పవని, అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు ఉన్నారు.

ఎస్‌కేఆర్‌లో హర్ ఘర్ తిరంగా అభియాన్


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ శివ ప్రసాద్

గూడూరురూరల్ : పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాపై పూర్తి స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుదామని పిలుపునిచ్చారు. జాతీయ జెండాతో ఫొటో దిగి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో పోస్టు చేసి అందరిలో జాతీయ భావాన్ని పెంపొందిచాలని సూచించారు. ఈ మేరకు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ మైమూన్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.విజయ, పీడీ నారాయణరాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.పీర్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ శైలజ, డాక్టర్ గోవిందు సురేంద్ర, డాక్టర్ కోటేశ్వరరావు, శ్రీధర శర్మ, రవి రాజు, గౌతమ్, శ్రీనివాసులు, కిరణ్మయి, డాక్టర్ ఝాన్సీవాణి పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



వెంకటగిరి: చిన్నారికి మాత్ర ఇస్తున్న సీడీపీఓ శంషాద్‌బేగం, పెళ్లకూరు: విద్యార్థినికి మాత్ర వేస్తున్న వైద్యులు, సిబ్బంది

రాపూరు/ఓజిలి/పెళ్లకూరు/వెంకటగిరిరూరల్/కోట: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ మాత్రల వల్ల కడుపులో నులిపురుగులను నిర్మూలించవచ్చని వివరించారు. రాపూరు మండలంలో ఎంఈవో జిలాని, వేపినాపి పీహెచ్‌సీ వైద్యాధికారిణి రాజకుమారి పాల్గొన్నారు. ఓజిలి మండలంలో వైద్యాధికారి మోహన్‌రంగా, హెచ్‌ఎం శోభనాకుమారి, ఏఎన్‌ఎం కుసుమకుమారి, పెళ్లకూరు మండలంలో డాక్టర్ జితేంద్ర, ఎంపీడీవో ప్రమీలారాణి, సీహెచ్‌వో వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. వెంకటగిరి మండలంలో ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, ఎంపీడీఓ నరసింహం, సీడీపీఓ శంషాద్‌బేగం, బంగారుపేట పీహెచ్‌సీ వైద్యులు శివకృష్ణా రెడ్డి, కోట మండలంలో పీహెచ్‌సీ వైద్యులు నాగరాజు ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు.

ఉపాధిలో రాజకీయ జోక్యం తగదు


మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

వాకాడు: వెలుగు, ఉపాధి హామీ పథకాల్లో రాజకీయ జోక్యం తగదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కావడలూరు దామోదర్‌రెడ్డి మండిపడ్డారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ జోక్యంతో ఎప్పటి నుంచో సేవలందిస్తున్న వెలుగు సిబ్బందిని తొలగించి వారికి అనుకూలురైన వారిని నియమించడం వల్ల కొందరికే లబ్ధి చేకూరుతుందన్నారు. ఇష్టానుసారంగా పాఠశాలలను విలీనం చేయడం వల్ల చాలా మంది పేద విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఉపాధి పనుల్లో స్థానిక సర్పంచుల ప్రమేయం లేకుండా పనులు చేయడం ఏమిటని అధికార పార్టీకి చెందిన నిడిగుర్తి సర్పంచి మల్లావు నాగరాజు సమస్యను లేవనెత్తడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, పలువురు అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.